'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - కాకినాడ : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. బుధవారం తాళ్లరేవు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, కాకినాడ ఆర్డీవో ఎన్వీవీ సత్యనారాయణతో కలిసి ప్రజల వినతులను సావధానంగా విని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 36 అర్జీలు అందాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో రాజు ప్రతిభ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సరళ దేవి కళ్యాణమండపంలో నిర్వహించిన వైయస్సార్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్ ఫు కరాటే పోటీలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామానికి చెందిన శల్లా రాజు సీనియర్స్ గ్రీన్ బెల్ట్ స్పారింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ మెడల్స్ సాధించినట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ టి. అబ్బులు తెలిపారు. గెలుపొందిన రాజును స్థానిక మండల అధ్యక్షులు సత్యవేణి దుర్గారావులు, గ్రామ సర్పంచ్ కుడుపూడి రాంబాబు, వైయస్సార్ సిపి నాయకులు కుడుపూడి శివ శంకర్, అతికెల శంబులింగం తదితరులు అభినందించారు.

కొత్త పెన్షన్లు అందజేత

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రం కపిలేశ్వరపురం మండల పరిషత్ వద్ద కొత్తగా మంజూరైన పెన్షన్ దారులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు 569 పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్‌ను అందజేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని, గతంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ తీసుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే గాని క్రొత్త వారికి పింఛన్ ఇచ్చేవారు కాదని నేడు అర్హులందరికీ పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలో సుమారు 9853 మందికి 2,65,01750 రూపాయలు పెన్షన్‌లు ఇస్తుండగా, కొత్తగా 569 మందికి కలిపి. మొత్తం 10422 లబ్ధిదారులకు సుమారు 2,80,82,250 రూపాయలు పెన్షన్ల నిమిత్తం మంజూరు చేశారని చెప్పారు.

రామాలయానికి నాలుగు కోట్ల 19 లక్షల కరెంట్ బిల్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మూలపేటవాడ బలిజిపేటలో ఉన్న రామాలయం గుడికి నాలుగు కోట్ల 19 లక్షల 83 వేల 536 విద్యుత్ బిల్లు రావడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. బుధవారం విద్యుత్ బిల్ కలెక్టర్ ఆగస్ట్ నెలలో వాడిన విద్యుత్ బిల్లు తీయగా ఒక కోటి ఏడు లక్షల యూనిట్లు వినియోగించినట్లు రావడంతో షాకుకు గురయ్యారు. పరిశ్రమలకు కూడా ఇంత విద్యుత్ బిల్లు రాదని చిన్న ఆలయానికి ఇంత మొత్తంలో బిల్లు రావడంతో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడిందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై విద్యుత్ ఏఈ ప్రసాదును కలిశారు. దీంతో మీటర్ను పరిశీలించగా మీటర్ స్కానింగ్ చేసే సమయంలో పొరపాటు జరిగినట్లు ఏఈ తెలిపారు.

హామీలను అమలు చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే తలారి వెంకట రావు కొనియాడారు. బుధవారం స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలలో అర్హులైన 651 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, నాయకుల చేతుల మీదుగా పెన్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ,వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ, జడ్పిటిసి కాకులపాటి లలిత, ఎంపీటీసీలు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర - అయినవిల్లి : మండల స్థాయిలో జరిగే ఆటలు పోటీలకు క్రీడాకారులు ఎంపిక కార్యక్రమాన్ని జడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనువాస్, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి బుధవారం ముక్తేశ్వరం హైస్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీను, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, పీటీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం

విశాలాంధ్ర - అయినవిల్లి : రాజోలు మండలం శివకోడుకు చెందిన బోళ్ళ శ్రీనివాస్ బుధవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని శ్రీ విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళం ఇచ్చారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు విఘ్నేశ్వరస్వామి వారి చిత్రపటం బహూకరించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

విశాలాంధ్ర - అనపర్తి : పార్టీ పదవులు పొందిన నేతలంతా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ పదవులు పొందిన అనపర్తికి చెందిన నాయకులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వరుపుల సుబ్బారావు ఘనంగా సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో నాయకులంతా పార్టీ విజయానికి కృషిచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, ఎఎంసి చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్, ఉప సర్పంచ్ వారా కుమారి,చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర బట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టి రాజు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం

కాకినాడ జిల్లా సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం విమర్శ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసే విధానం అప్రజాస్వామికంగా ఉందని, రాష్ట్రంలో ప్రజా సంఘాల ఆందోళనను పోలీసులతో అణిచివేస్తున్నారని దీనిని అఖిల పక్షం, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బాల చెరువు కాస్మో పాలిటిన్ క్లబ్బులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును, ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్న వైఖరికి నిరసనగా రౌండ్ టేబుల్ సమావేశం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, మాజీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణం అన్నారు. ఎవరి కళ్ళల్లో ఆనందం కోసం సిబిసిఐడి పనిచేస్తుందని వారు విమర్శించారు. ప్రజా వేదిక కూల్చడం ద్వారా కక్ష సాధింపుతో జగన్ పాలన ప్రారంభమైందని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై నియంతల పరిపాలన చేస్తున్నారని వారు తెలిపారు. వైసీపీని ఓడించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు. జగన్ లాంటి నియంతకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని వారు విమర్శించారు. చంద్రబాబు నాయుడు అక్రమ కేసు ఎత్తివేసే వరకు ప్రజా ఆందోళన కొనసాగుతుందని, దీనికి సహకరిస్తున్న అన్ని రాజకీయ పార్టీలకు నవీన్, కొండబాబు అభినందనలు తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం విలువలు పతనమవుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన ప్రజా ఉద్యమం రావలసిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరు ముందుకొచ్చి ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. జనసేన జిల్లా అధ్యక్షులు తోట సుధీర్ మాట్లాడుతూ పరిపాలనాదక్షుడు చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడాన్ని జనసేన పార్టీ తప్పుపడుతుందని అన్నారు. పిసిసి మెంబర్ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ మోడీ, జగన్ ఇద్దరు తోడుదొంగలుగా మానవ హక్కుల్ని హరిస్తున్నారని అన్నారు. జగన్ నియంతృత్వ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా జగన్మోహన్ రెడ్డి ప్రజా ఉద్యమాలపై అణిచివేత ధోరణి అవలంభిస్తున్నారని అన్నారు. ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట వరప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి దళిత, గిరిజన, బలహీన వర్గాల పై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. టిడిపి చేసే ఉద్యమాలకు ఆర్పిఐ పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. జై భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జునరావు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో న్యాయ వ్యవస్థ పై కూడా నమ్మకం పోయేలా ఉందని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలోనే ప్రజాస్వామ్యం మంట కలుస్తోందన్నారు. మోడీ అధికారంలో ఉన్నంతవరకు రాష్ట్రంలో మానవ హక్కులు ఉండవని మోడీ, జగన్ ఇద్దరు కలిపే చంద్రబాబును అరెస్ట్ చేశారని కృష్ణమూర్తి తెలియజేశారు చివరగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

సమావేశంలో 93 కులాల ఐక్యవేదిక నాయకులు, మాకిరెడ్డి గణేష్ బాబు, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు చల్లంగి వేణుగోపాల్, ఆర్టిఐ జేఏసీ పప్పుదుర్గా రమేష్, సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజ శేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సత్యనారాయణ, టిడిపి నగర అధ్యక్షులు వీరు, తుమ్మలపల్లి రమేష్, జనసేన నాయకులు సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు, తాళ్లూరి రాజు, పిఎస్ నారాయణ, పప్పు ఆదినారాయణ, గదుల సాయిబాబా, ఫణేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

ప్రభుత్వాసుపత్రుల వికేంద్రీకరణ జరగాలి

విశాలాంధ్ర - కాకినాడ : 13 జిల్లాల స్థానంలో 26 జిల్లాలు ఏర్పడి ఏడాదిన్నరైనప్పటికీ ప్రభుత్వాసుపత్రుల వికేంద్రీకరణ జరగలేదని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. 6 జిల్లాల పరిధి నుండి వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య అత్యధికం కావడంతో కాకినాడ ప్రభుత్వాసు పత్రిలో పడకల సామర్థ్యం లేక కనీసంగా ఒపి సేవలు సైతం పూర్తి స్థాయిగా అందించలేని దీనావస్థకు చేరడం దురదృష్ట కరమన్నారు. తగినన్ని స్ట్రెచర్లు, వీల్ చైర్లు లేకపోవడం వైద్యపరికరాల కొరత నిరంతర రిపేర్లతో ఎంఆర్ఐ స్కానింగ్ మున్నగు అసౌకర్యాలతో ప్రభుత్వాసుపత్రి ప్రయోజనం లేకుండా తయారవుతోందన్నారు. పార్కింగ్ ప్రదేశం కేటాయించకపోవడం వలన ఆసుపత్రి ఆవరణ లోపలా బయటా కార్లు, భారీగా మోటారు సైకిళ్లు, అంబులెన్స్‌ల పార్కింగ్ ఎక్కువై తీవ్ర వాయు కాలుష్యంతో మరింత అనారోగ్య వాతావరణం ప్రబలిందన్నారు. కొత్త జిల్లాల వారీగా ప్రభుత్వ శాఖలను వేరు చేసిన రీతిలో ప్రభుత్వాసు పత్రులను కూడా జిల్లాల వారీగా వికేంద్రీకరణ చేసి పేదల వైద్యాన్ని పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ నిర్వహణ ఆచరణలో లేకపోవడం తగదన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: మండలంలో నూతనంగా 492 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఉంగ్రాజవరంలో బుధవారం ఏర్పాటుచేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్ద, కొన్ని గ్రామాలలో సచివాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవాడ ఇందుకూరి దేవి భార్గవి, ఐ వి ఎస్ రాజు, మంతెన చంటి రాజు, వెలగదుర్రు సాగి పద్మావతి, దమ్మెన్ను గురజర్ల వీర వెంకట సత్యనారాయణ, పాలంగి బొక్కా శివ, పాలాటి శరత్, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బలవన్మరణాలు లేని భారతావనికి కృషి

విశాలాంధ్ర - జగ్గంపేట : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల గ్రంథాలయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్ మాట్లాడుతూ పరీక్షల్లో విఫలమయ్యారని, తల్లిదండ్రులు తిట్టారని క్షణికమైన ఆవేశంతో విద్యార్థుల అమూల్యమైన భవిష్యత్ ను నాశనం చేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా కమిటీ జాయింట్ ట్రెజరర్ తోటకూర గంగాధర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ 10 సెకన్లకు ఒక ఆత్మహత్య జరుగుతుంది. ఇందులో 15 నుంచి 20 సంవత్సరాల మధ్య యువత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బలవన్మరణాలు లేని భారతావని కోసం మనమందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ బిఎన్‌బి వైదేహి, ఎన్ దివ్య, డాక్టర్ జి వేద ప్రియ, పి వినీల, టి ప్రశాంతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో ఆర్డీవో ఎన్‌వివి సత్యనారాయణ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. కరప మెయిన్ స్కూల్లో ఉన్న అసెంబ్లీ పోలింగ్ బూత్ నెం.199, 264లను పరిశీలించినట్లు ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. మండల గ్రామాలైన వేములవాడ, వేలంగిలో ఉన్న పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అంగన్వాడి సెంటర్లను, స్కూళ్లలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆర్డీవో సత్యనారాయణ వాటి పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ కరప మండలంలో ఉన్న పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సమయానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ ముఖర్జీ, ఆర్ఐ మాచరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అరెస్టు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఈ అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చంద్రబాబును తక్షణమే విడిచిపెట్టి స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, ఆయన కుమారుడు లోకేష్‌ను అనుమతించకపోవడం అప్రజాస్వామికమని అన్నారు. ఈ అరెస్టులను సిపిఐ జిల్లా కమిటీ ఖండిస్తుందని, ఆయనను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : తెలుగుదేశం పార్టీ జాతీయ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బాబుతో నేను అనే నినాదంతో ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుంకర పావని తిరుమల కుమార్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడిని ఏ చట్టం ప్రకారం అరెస్ట్ చేశారు? స్కిల్ డెవలప్ మెంట్ పెద్ద కుంభకోణమని ప్రచారం తప్ప ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటాం అని సుంకర పావని తిరుమల కుమార్ హెచ్చరించారు.

గోకవరంలో : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ గోకవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ఎదురుగా గోకవరం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా ఏమిటో చూపిస్తామని అన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలలో గోకవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాము, రాష్ట్ర టీడీపి రైతు ఉపాధ్యక్షులు కడప భరత్, గోకవరం సర్పంచ్ కొమరం శ్రావణి, ఉంగరాల రాము, పిల్లా అర్జున సారథి, వల్లేపల్లి సత్యనారాయణ, బదిరెడ్డి బాబి గద్దం బాబు, గోకవరం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు మాజీ సర్పంచులు, తెలుగుదేశం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రావులపాలెంలో: చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుతో తెలుగుదేశం పార్టీ అదేశాల మేరకు జరుగు తున్న రిలే నిరాహార దీక్షలలో అమలాపురం పార్ల మెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జియం హరీష్ బాలయోగి పాల్గొన్నారు. కొత్తపేట నియోజక వర్గం, పి గన్నవరం నియోజకవర్గాలలో జరిగిన రిలే నిరాహారదీక్షలలో హరీష్ పాలుపంచు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేయడం జగన్ ప్రభుత్వ కక్ష సాధింపునకు నిదర్శనమని అన్నారు.

ముమ్మిడివరంలో : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముమ్మిడి వరం నియోజక వర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చి బాబు (సుబ్బరాజు) ఆధ్వర్యంలో ముమ్మిడివరం టిడిపి కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు నాయుడు పై సానుభూతి చూపిస్తున్నారని అన్నారు. ఆయనపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొల్ల కోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, దాట్ల పృథ్వీరాజ్, తాడి నరసింహారావు, ములపర్తి బాలకృష్ణ, విల్లా వీరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో : నారా చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. "బాబుతో నేను" అనే నినాదంతో తిలక్ రోడ్డులోని రాజమహేంద్ర వరం సిటీ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష జరిగింది. ఈ దీక్షా కార్యక్రమంలో ముందుగా "బాబుతో నేను" అని ముద్రించిన బ్యానర్‌పై పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సంతకాలు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఆదిరెడ్డి శ్రీనివాస్, యర్రా వేణు గోపాల రాయుడు, కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

పేదలకు భరోసా 'వైఎస్ఆర్ పింఛను కానుక'

793 కొత్త పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : నిరాదరణకు గురై వృద్ధాప్యంలో ఉన్న ఎంతో మంది పేద వృద్ధులు, భర్తలను కోల్పో యిన వితంతువులు, దివ్యాంగు లకు వైయస్సార్ పింఛన్‌కానుక ఎంతో భరోసాగా నిలుస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొ న్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో బుధవారం సిటీ నియోజకవర్గ పరిధిలో కొత్తగా మంజూరైన 793 పింఛన్లను ఎమ్మెల్యే ద్వారంపూడి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పేద అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల సొమ్ము పెంపుదలతోపాటు పారదర్శకంగా పంపిణీ ప్రక్రియ కూడా చేపట్టి సామాజిక భద్రత కల్పించారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న పింఛన్ల పంపిణీ సహా ఇతర పథకాలన్నీ దేశంలోనే ఏపీకి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చాయన్నారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ పింఛన్‌పొందే వారి ఆత్మగౌరవాన్ని పెంచేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఒకటవ తేదీ ఉదయం 6 గంటలకే ఇంటికి వెళ్ళి పింఛన్ మొత్తాన్ని అందించేలా చర్యలు తీసుకున్నా రని అన్నారు. వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ మాట్లాడారు. 793 కొత్త పింఛన్లకు సంబంధించి రూ.21.94లక్షల మెగా చెక్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి, ఇతర అధికారులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, గోడి సత్యవతి, లంకే హేమలత, కర్రి శైలజ, కంపర బాబి, జెడి పవన్‌కుమార్, రాగిరెడ్డి బన్ని, తెహరాఖాతూన్, భీమరాజు, చవ్వాకుల రాంబాబు, సంగాని నందం తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు నిర్మాణ కార్యక్రమ లక్ష్యాల సాధనలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ గృహనిర్మాణ సంస్థ ఇంజ నీర్లను హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు హాలులో జిల్లా స్థాయిలో గృహ నిర్మాణాల పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ సచివాలయ లే అవుట్ల వారిగా జగనన్న కాలనీల నిర్మాణాల పురోగతిపై సమీక్షించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వారంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించని ఇంజనీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టిందని ఆ దిశగా పురోగతిని సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె స్పష్టం చేశారు. ఇంజనీర్లు లబ్ధిదారులను గృహ నిర్మాణం చేపట్టేలా చైతన్య పరిచి నిర్మాణాలను వేగవంతం చేయడం ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు సిహెచ్ బాబురావు గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు పాల్గొన్నారు.

వరి సేకరణకు ప్రణాళిక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ బుధవారం సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ, 2023 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి సేకరణకు ఎలా సిద్ధం కావాలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఆ మేరకు ప్యాక్ సొసైటీ సిఈవో ల పాత్ర పై స్పష్టంగా వివరించారు. ధాన్యం కొనుగోలు సమయంలో పిఏసిఎస్‌ల ద్వారా తమ మద్దతును అందించాలన్నారు. మరియు సిఐఒలకు తమ గ్రామాల్లోని రైతుల అవసరాలపై మంచి అవగాహన కలిగి ఉండడం వల్ల కొనుగోళ్లను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో అమలు చేస్తున్న సంస్కరణలను జాయింట్ కలెక్టర్ వివరించారు. పి ఎస్ ఏ లతో దెబ్బతిన్న అన్ని గన్నీ బ్యాగులను ఒకటి లేదా రెండు రోజుల్లో తరలిస్తామని ఆయన తెలియజేశారు. మెటీరియల్, తేమ మీటర్ తదితర పరికరాలను ముందుగానే సరిచూసు కోవాలని పౌరసరఫరాల డీఎం కుమార్ సీఈవోలందరికీ సూచించారు. సమస్యలుంటే టెక్నికల్ టీమ్‌ను పంపి సరిచేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ డీఎం ఏ .. కుమార్, డీఎస్‌వో పి. విజయ భాస్కర్, డి సి వో వై. ఉమా మహేశ్వర రావు లు ప్యాక్ సొసైటీ సీ ఈ వో లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న సీఎం జగన్ రాక

విశాలాంధ్ర - నిడదవోలు : కాపు నేస్తం 4వ విడత నిధులు విడుదల రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రానున్నట్లు నిడదవోలు శాసనసభ్యులు జీ. శ్రీనివాసనాయుడు బుధవారం తెలిపారు. స్థానిక సెయింట్ ఆంబ్రోస్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో చేస్తున్న సభ వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావం,అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న సీఎం జగన్ కాపు నేస్తం 4వ విడత నిధులు విడుదల రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఈ 16న వస్తున్నారన్నారు. కాపు నేస్తం సభకు పెద్దఎత్తున లబ్ధిదారులతో పాటుగా వైసీపీ కార్యకర్తలు, అభిమానులు సభకు వచ్చేలా అందరూ సమిష్టిగా కృషి చేసి సభను విజయవంతం చేయాలని శ్రీనివాసనాయుడు పిలుపునిచ్చారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లకు నిధులు మంజూరు చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్

విశాలాంధ్ర - గోపాలపురం : గోపాలపురం మండల వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కరువయ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఎస్సీ హాస్టల్, బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరాయని, విద్యార్థులు సంఖ్య తగ్గిందనే కుంటి సాకుతో విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు నిధులు మంజూరు చేయకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఈ హాస్టల్‌కు అప్పటి జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా దుర్వినియోగం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. మండలంలో చిట్యాల, వాదాలగుంట, బుచ్చిపాలెం, అచ్చిపాలెం, వేద్యలకుంట, కోమటికుంట, కొవ్వూరుపాడు, తదితర ప్రాంతాల నుండి విద్యార్థులు హాస్టల్లో ఉండే వారని వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థుల సంఖ్య కొంత తగ్గిందని అన్నారు. ఎస్సీ హాస్టల్‌ను కొద్ది మంది రాజకీయ నాయకుల అండదండలతో అన్యాక్రాంతం చేస్తున్నారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై. సునీల్, సిహెచ్ భాను, టి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నూతనంగా మంజూరైన వివిధ రకాల 18 పింఛన్ల ను జెడ్పీటీసీ సభ్యులు పోల్నాటి బాబ్జీ, సర్పంచ్ యడ్లపల్లి రాధిక చేతుల మీదుగా స్థానిక సచివాలయం వద్ద బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి బాబ్జి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సర్పంచ్ రాధిక మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పించన్ లు అందిస్తుందన్నారు. ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వైసీపీ నాయకుల చేతుల మీదుగా వితంతు, కల్లుగీత కార్మికుల పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-వీరవాసరం: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపిడిఓ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాన్ డేస్ విధానం రద్దు చేయాలని, తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరికీ ఎఫ్ఎఇ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత 17 ఏళ్లుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారిని గుర్తించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ యాప్లో సాంకేతిక కారణాల వల్ల చేసిన పనులకు కూలీల హాజరు, పని ప్రదేశాల్లో ఫొటోలు అప్లోడ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లు అనే తారతమ్యం లేకుండా అందరిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగించాలని, అర్హత, అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డు సౌకర్యం కల్పించి, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు అమలు వంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సుదీర్, బాలకృష్ణ, పుష్పారావు, నాగరాజు, పెద్దిరాజు, జివి.సత్యనారాయణ, శ్రీనివాసరావు, టి.సత్యనారాయణ, అనురాధ వెంకటలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం ఈవోపీఆర్డీగా సారథి

విశాలాంధ్ర-వీరవాసరం: వీరవాసరం ఈవోపీఆర్డీగా టివి సారథి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శిగా చేస్తూ ఉద్యోగోన్నతిపై వీరవాసరం మండల ఈవోపీఆర్డీగా నియమి తులయ్యారు. ఈ సందర్భంగా సారథి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మండలంలో 336 పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా అర్హులైన వారికి కొత్తగా 336 పెన్షన్లు మంజూరు అయ్యాయని జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బోడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం పి. రాజవరం గ్రామంలో నూతన పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు వికలాంగులు వితంతువులు అర్హులైన ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వంలో పింఛన్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. పి రాజవరం పంచాయతీకి నూతనంగా 20 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని అన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ మళ్ళీ జగన్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని అన్నారు. ఈ ప్రభుత్వం అయితేనే తమకు సక్రమంగా పింఛన్లు అందుతాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, ఉప సర్పంచ్ శ్యామల, శరణ్య, నాయకులు సూరిశెట్టి ఏసుబాబు, తమ్మ మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కొబ్బరి చెట్టు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - పెనుమంట్ర: పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామంలో వెలమ పేట రామాలయం చెంతన ఉన్న కొబ్బరి చెట్టు బుధవారం తొలగించారు. సెప్టెంబర్ 9వ తేదీన భయపెడుతున్న కొబ్బరి చెట్టు అనే శీర్షిక తో విశాలాంధ్ర పత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనంతో విద్యుత్ శాఖ, స్థానిక పంచాయతీ, కొబ్బరి చెట్టు యజమాని సుమారు రూ.3500 వెచ్చించి తొలగించారు. కొబ్బరి చెట్టు ప్రమాదకరంగా అత్యంత పొడవుగా ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలపై స్థానిక ప్రజలను భయపెడుతూ కనిపించేదని... విశాలాంధ్ర పత్రిక వారికి స్థానిక గ్రామ ప్రజలు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

విష జ్వరాల నుండి ప్రజలను కాపాడండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలో రోజురోజుకు పెరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న విష జ్వరాల నుండి ప్రజలను కాపాడాలని ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల ముందు ధర్నా చేసి ఆయా కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆ సంఘాల జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శులు కారం సత్యవతి, కొండా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలతో ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని అన్నారు. జ్వరాలతో, వివిధ జబ్బులతో వేలేరుపాడు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులకు సరైన మందులు లేక ప్రైవేట్ హాస్పిటల్లో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వెంటనే ఇంటింటికి దోమల మందు కొట్టించాలని, దోమతెరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్కె మున్ని, కోశాధికారి సోయం వసంత, నాయకులు మడివి కన్నమ్మ సున్నం దుర్గమ్మ, గడ్డాల రమణ, మచ్చ సుభద్ర, సున్నం రాణి, పి వై ఎల్ డివిజన్ అధ్యక్షులు కట్టం రాంబాబు, డివిజన్ నాయకులు సోయా రాంబాబు, కారం రాముడు, పి. వీరబాబు, మద్దాల సురేష్, తుర్రం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రోజాపై మాజీ మంత్రి పీతల ఫైర్

విశాలాంధ్ర -పాలకొల్లు: మంత్రి రోజా సవ్యంగా మాట్లాడితే మంచిదని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. బుధవారం చంద్రబాబు రిమాండ్ కు నిరసనగా పాలకొల్లులో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలలో ఆమె పాల్గొన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు ఆత్మహత్య చేసుకునే స్థితిలోకి వెళ్లిన నువ్వు, మంత్రి పదవి వచ్చాక ఆస్తులు ఎలా కూడబెట్టావో తెలుసన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని అన్నారు.

టీడీపీకి పెరగనున్న ఓటు శాతం

విశాలాంధ్ర - పాలకొల్లు: కేవలం కుట్రపూరితంగా మాత్రమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగిందని టిడిపి పాలకొల్లు మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. బుధవారం పాలకొల్లులో టిడిపి నిరసన దీక్షలలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబుకు రిమాండ్ విధించడం అనే అంశం టిడిపికి కలిసొస్తుందన్నారు. రోజుకు 1లక్ష చొప్పున 14 రోజులలో 14 లక్షల ఓటింగ్ టీడీపీకి పెరుగుతుందన్నారు. ప్రజలలో తమ అధినేత చంద్రబాబుకు అన్యాయంగా రిమాండ్ విధించారనే సానుభూతి ఉందన్నారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యత సాధించాలి

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థిదశ నుండే చదువుతో పాటు నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకుంటే ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోగలరని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక డి.యన్.ఆర్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సందర్శించి, కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులు వారి చదువుతోపాటు ఎప్పటికప్పుడు సాఫ్ట్ స్కిల్స్ లేదా ప్రొఫెషనల్ స్కిల్స్‌లో నైపుణ్యాన్ని పొందాల్సిన అవసరం ప్రతీ ఒక్కరికి ఉందని అన్నారు. విద్యార్థులు తమ చదువును ఒక నిరంతర ప్రక్రియగా ఎలా పరిగణిస్తారో ఉద్యోగులు, ఉద్యోగార్థులు కూడా నైపుణ్యాలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని అన్నారు. 10వ తరగతి మొదలుకొని పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివిన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నందున వారందరూ తమ ప్రాథమిక అర్హత తోపాటు నైపుణ్యాలను అదనపు అర్హతగా చూపి పేరొందిన సంస్థలలో ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. ఇంత భారీ స్థాయిలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినందుకు డి.యన్.ఆర్ కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.యస్.శాంత కుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో భారీ స్థాయిలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డి.యన్.ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు మాట్లాడుతూ డి.యన్.ఆర్ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులతో పాటుగా ఇతర విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు కూడా వారి వారి అర్హతల మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం సామాజిక బాధ్యత గా భావించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. పాలకవర్గ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ డి.యన్.ఆర్ విద్యా సంస్థలలో విద్యార్థులకు కావలసిన వివిధ రకాల నైపుణ్యాలను అందించడానికి తగిన సౌకర్యాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచి ఒక నిరంతర ప్రక్రియగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కళాశాల పాలక వర్గ ఉపాధ్యక్షులు జి. పాండు రంగరాజు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు సుమారు 22 కంపెనీల నుండి ఎంపిక చేసుకునే ప్రతినిధులు హాజరయ్యారని, ఉద్యోగాల కోసం సుమారు 1200 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయడంలో డి.యన్.ఆర్. కళాశాల యాజమాన్యం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. .ఈకార్యక్రమంలో పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, ట్రెజరర్ జి.వి.యస్.ఆర్ నారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు, పాలకవర్గ సభ్యులు యన్.రామలింగరాజు, దత్తాత్రేయ వర్మ, పి.రామకృష్ణంరాజు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న టీడీపీ రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తేదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా టీడీపీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధ వారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. తెదేపా పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగు తున్నాయి. రెండవ రోజు దీక్షలో పాతూరి అంబేద్కర్, గుళ్ళపూడి శ్రీదేవి, గంటా శ్రీను, చిలపరెడ్డి ఇంద్రాణి, కోనేటి చంటి, రాగాని శ్రీనివాస్, గెడ సుబ్రహ్మణ్యం, కంకి పాటి భద్ర రావు, దండే పద్మ, కన్నా శ్రీదేవి, నాయుడు శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, కే ఎల్ ఎం ఆనంద్, అద్దేపల్లి రవికుమార్ లకు చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామకుమార్, తూటికుంట రాము,రాజాని సత్యనారాయణ, యాగంటి సుబ్రహ్మణ్యం, చిట్రోజు తాతాజీ, తడికమళ్ళ గోపాలరావు చెరుకూరి శ్రీధర్, చిట్టి బోయిన రామలింగేశ్వర రావు తదితరులు పూల మాలలు వేసి దీక్షశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటా మురళీ రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుపై గత మూడు రోజులు గా కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. తెదేపా రాష్ట్రకార్యదర్శి దాసరి శ్యాంసుందర్ శేషు మాట్లాడుతూ టిడిపి క్యాడర్ లో మనోధైర్యం కోల్పోయేలా చేయటమే వైసీపీ కుట్ర అనే విషయాన్ని అన్ని వర్గాలకు వివరించేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఈ దీక్షా శిబిరాన్ని చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపుముత్తారెడ్డి, బొమ్మాజి అనిల్, సొంగారోషన్ కుమార్, అకుమర్తి రామారావు,మాముడూరి మహంకాళి, లీలా ప్రశాంతి,కామవరపుకోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిలారి సత్యనారాయణ, లింగపాలెం మండల తెలుగుదేశం అధ్యక్షులు పార్టీగిరిమెళ్ళ చలపతిరావు, చింతలపూడి రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోటూరి వెంకటరామయ్య, కామవరపు కోట మాజీ జడ్పిటిసి గంటా సుధీర్ బాబు, చింతలపూడి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు జంగారెడ్డిగూడెం పట్టణ రూరల్ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో సంఖ్యలో వచ్చి సంఘీభావం ప్రకటించారు.

భీమవరంలో: చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా భీమవరంలో టిడిపి శ్రేణులు నిరాహార దీక్షలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ జగన్‌కు దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి రావాలన్నారు. దీక్షా శిబిరాన్ని జనసేన రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు కనకరాజు సూరి సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్ట్ తో జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు కార్యక్రమాల్లో జనసేన నాయకులు చెనమల్ల చంద్రశేఖర్, సుంకర రవి, మోకా శ్రీనివాస్, మాగాపు ప్రసాద్ రామాయణం, శ్రీనివాస్ దారపురెడ్డి, త్రివిక్రమ్ నాగిడి శ్రీనివాస్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముసునూరులో : మండల కేంద్రమైన ముసు నూరు మండపం సెంటర్ వద్ద రిలే నిరహార దీక్షలు చేపట్టగా,ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, గద్దె రఘుబాబు, అట్లూరి రవీంద్ర, కొల్లి గంగరా మ్, మెదరమెట్ల సురేంద్ర, చిలుకూరి వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, కాటేపల్లి ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, గద్దల మోహనరావు, పులిబళ్ల లక్ష్మిసత్యనారాయణ,రాపర్ల ప్రతాప్, గూడపాటి ఆజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ భరోసాతో నూతన ఉత్సాహం

విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా అధినేత చంద్రబాబు రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో నందమూరి బాలకృష్ణ రంగ ప్రవేశం చేసి భరోసా ఇవ్వడంతో పార్టీలో ఉత్సాహం నిండు కుందని జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో తెదేపాకి ఇటీవల వస్తున్న ప్రజాదరణను చూసి భయభ్రాంతులకు గురై కుట్రపన్ని రిమాండ్ కి పంపించారని అన్నారు. తెలుగుదేశం పార్టీని ఓడించాలన్న వారి కలలు అడియాశలు అవక తప్పదన్నారు.



చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - నిడదవోలు : రుజువులు,సాక్ష్యాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ చౌక్ సెంటర్లో బుధవారం సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాదీక్ష లో పాల్గొన్న కుందుల సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై కక్ష సాధింపు లో భాగంగానే అక్రమ కేసు బనాయించారన్నారు. దీక్షలో పేరూ రి సాయిబాబు,అంబటి వెంకటరమణ, మద్దుకూరి రాధా, కే.సత్య నారాయణ, జీ. శ్రీనివాసరావు, గోవిందరావు, బాబు, తెలుగుదేశం నాయకులు పాల్గొనగా జనసేనపార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.



బాబుకు తోడుగా రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర - జగ్గంపేట : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో రిలే నిరహారదీక్షలను బుధవారం టిడిపి నాయకులు చేపట్టారు. బాబుకు తోడుగా మేము సైతం అనే నినాదంతో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ రిలే నిరహారదీక్షలు చేస్తున్నారు. ఈ రిలే నిరాహార దీక్షలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రేఖా బుల్లి రాజు, కొత్త కొండబాబు, వైబోగుల కొండబాబు, తదితరులు నల్ల కండువాలు ధరించి రిలే నిరాహారదీక్షలు చేశారు. గండేపల్లిలో టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ గండేపల్లి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలను జ్యోతుల నెహ్రూ సందర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోర్పు లచ్చయ్య దొర, తదితరు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఐదు రోజుల క్రితం కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన దుబ్బాకుల మధుసూదన్‌రావు (29)రోడ్డు ప్రమాదంలో మరణించాడు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వైయస్సార్ బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. తక్షణ సహాయం కింద రూ.10,000 బుధవారం మండల వైకాపా నాయకుడు ఆనాల సుదర్శన్,. గ్రామ సర్పంచ్ కర్రీ చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణులు. చేతుల మీదగా మరణించిన యువకుడి తల్లికి అందజేశారు. త్వరలోనే మిగిలిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుం దని, మరణించిన యువకుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నాయకులు కల్పించారు. ఈ కార్యక్రమంలో కుతుకుడిమిల్లి వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, గ్రామ పెద్దలు దున్న చిట్టిబాబు, దున్న సుబ్బారావు, దున్న మురళి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సకాలంలో పెన్షన్లు

విశాలాంధ్ర - పి గన్నవరం : అర్హత కలిగిన పేద ప్రజలందరికీ వైకాపా ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ సకాలంలో పెన్షన్లను అందిస్తున్నారని పి గన్నవరం మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు అన్నారు. ఆయన మండలంలోని కే ఏనుగుపల్లి గ్రామ సచివాలయం వద్ద నూతనంగా వైయస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా పెన్షన్లు మంజూరైన 18 మంది లబ్ధిదారులకు పెన్షన్ల సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ డి.ఆదిబాబు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రావులపాలెం గ్రామ సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యంలో రావులపాలెం గ్రామంలోని 5 సచివాలయాలకు సంబంధించి రెండవ విడతగా మంజూరైన 106 వైఎస్ఆర్ పెన్షన్ కానుక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ సాక మణికుమారి ప్రసన్న కుమార్, రావులపాలెం మండలం జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, రావులపాలెం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు వెలగల సత్యనారాయణరెడ్డి, కోట శ్రీలక్ష్మి వెంకటేశ్వరరావు, కోనాల రాజ్ కుమార్, గెద్దాడ నాగేశ్వరరావు, రావులపాలెం మండల యంపిటిసి సభ్యులు కోట విజయ కుమారి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలి

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణంలోని తీరుగూడెంలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కోగృహాలను లబ్ధిదారు లకు వెంటనే అందజేయాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీరుగూడెంలో నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో గృహాలను సీపీఎం బృందం బుధవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 16 న నిడదవోలు విచ్చేయనున్న సీఎం జగన్మోహన్ రెడ్డి పట్టణంలోని 1200మంది పేద టిడ్కో లబ్ధిదారులకు వెంటనే గృహాలను అందజేయాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పట్టణంలోని సుమారు 12వందలమంది పేద లబ్ధిదారులు లక్షల రూపాయలు అప్పులు చేసి ప్రభుత్వానికి చెల్లించారని, ఇప్పటికీ దాదాపు 5సంలు పూర్తి కావొస్తున్న నేటికి వాటిని లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. 16న నిడదవోలు పర్యటనకు వస్తున్న సీఎం జగన్ కు టిడ్కో లబ్ధిదారులతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ, డొంకా రమేష్ లు పాల్గొన్నారు.

టీడీపీ నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-పెరవలి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బుధవారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి సెంటరులో టిడిపి శ్రేణులు నిడదవోలు నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. మాజీమంత్రి కొత్తపల్లి శ్యామ్యూల్ జవహర్ పాల్గొని సంఘీభావం తెలియజేసారు. మండల జనసేన, సీపీఐ కార్యకర్తలు సంఘీభావం తెలియజేసారు. ఈకార్యక్రమంలో అతికాల వెంకటరామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ, అబ్బిశెట్టి సత్తిరాజు, సలాది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో : చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రస్వామికంగా ఉందని కాట్రేనికొన మండల తెలుగు దేశం పార్టీ మహిళ అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి అన్నారు. ప్రజలు శాంతియుతంగా తమ నిరసనను తెలిపే హక్కును కూడా పోలీసులతో అణిచి వేస్తున్నారని, మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పై అక్రమ కేసులు ఎత్తివేసే వరకు ప్రజా ఆందోళన చేస్తామని యోగేశ్వరి హెచ్చరించారు.

గోపాలపురంలో : రాష్ట్ర ప్రభుత్వం సిఐడిని అడ్డుపెట్టుకొని కక్షపూరితంగా చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేయించడం హేయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు అరెస్టులు నిరసిస్తూ బుధవారం మూడవరోజు రిలే నిరాహార దీక్ష స్థానిక చెక్పోస్ట్ సెంటర్లో కొనసాగింది. నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని మద్దిపాటి వెంకటరాజు సందర్శించారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరావు మాట్లాడుతూ పరిపాలనలో రాజనీతిజ్ఞుడిగా అపార అనుభవంతో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అవినీతి అక్రమార్జనలో ఆరితేరిన జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాల ముందు న్యాయమే గెలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జి కిషోర్, పూడి సురేష్, బాలిన రాము, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం దీక్షలో కూర్చున్న వారికి మద్దిపాటి వెంకటరాజు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు.

రాజానగరంలో : చంద్రబాబు అక్రమ అరెస్టు కేవలం తాత్కాలిక శునకానంధం మాత్రమేనని జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ అన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని సూర్యారావు పేట లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం చేపట్టిన బాబుతో మేము సైతం సామూహిక రిలే నిరాహారదీక్షలకు మాజీ మంత్రి కెఎస్ జవహర్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాం చిన్నబాబు, రాష్ట్ర ఎక్జిక్యూటివ్ కార్యదర్శి శిష్టా లోహిత్, జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి,నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరాం కృష్ణ,బత్తుల వెంకటలక్ష్మి తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షదారులకు టీడీపీ లీగల్ అధ్యక్షులు గన్ని కృష్ణా నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గంగిశెట్టి చంటిబాబు,తెలుగు యువత అధ్యక్షులు కందుల బాబు రాయుడు,వంక మల్లిఖార్జున స్వామి, కొల్లం రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో : అధికారపక్షం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మాజీ ముఖ్యమంత్రి, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ మీరాన్ షరీఫ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వైసీపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడిందని అన్నారు. వైసిపి నాయకులు చంకలు బాదుకోవడమే గాని గురివింద గింజ సామెతను మర్చిపోయి. సునకానందం పొందుతున్నారన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర - కాకినాడ : 2015వ సంవత్సరంలో కాకినాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావు పేటలోని భాను అపార్ట్ మెంట్‌లో పెండ్యాల రవిశంకర్ (40) అనే వ్యక్తి ముద్దాయి కుమార్తెతో అక్రమ సంబంధం పెట్టుకుని భాను అపార్ట్మెంట్లో కాపురం పెట్టాడనే కక్షతో రవి శంకర్‌ను కత్తితో తీవ్రంగా నరికి చంపి, అడ్డు వచ్చిన నిందితుని సొంత కుమార్తె అయిన దుర్గ భవానిని కూడా తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై మృతుడి భార్య పెండ్యాల అనంతలక్ష్మి దేవి ఇచ్చిన ఫిర్యాదు పై కాకినాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐడి చైతన్య కృష్ణ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేయగా సదరు కేసులో నేరం నిరూపణ అవ్వడంతో బుధవారం నిందితుడు పటాల నాగేశ్వరరావుకు హత్య నేరం క్రింద యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10,000ల జరిమానా ఇదే కేసులో తన స్వంత కుమార్తెను తీవ్రంగా గాయపరిచినందుకు 307 సెక్షన్ క్రింద 10 సంవత్సరా జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ కాకినాడ మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి. కమలాదేవి తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. ఆదిత్యకుమార్ వాదించారు.

హానర్స్ విధానం గందరగోళం

విశాలాంధ్ర - కొత్తపేట : డిగ్రీ విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన హానర్స్ విధానం గందరగోళంగా ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మదన్ గుంజా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సులలో ఎక్కువ ప్రవేశాలు లేవు అనే సాకుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొన్ని కోర్సులు ఎత్తివేయడాన్ని ప్రశ్నించారు. ఏదైనా నూతన కోర్సులు ప్రవేశపెట్టినప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని వాటిని అధిమించగలిగితేనే కోర్సులు ప్రవేశపెట్టాలే తప్పా కోర్సులు ప్రవేశపెట్టి ఎక్కువ మంది విద్యార్థులు లేక కోర్సు తీసేవేస్తే చేరిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. విద్యార్థులను బలవంతంగా కళాశాలలు మార్చడం, గ్రూపులు మార్చివేయడం, ఇక్కడ ఉన్న గ్రూపులు ఎత్తివేయడం చేస్తే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టికెవి శ్రీనువాసురావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మదన్ గుంజా, మండలం కార్యదర్శి వెలుమూరి హెమంత్ కుమార్, డి కిషోర్, కె ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు పరిశీలన

విశాలాంధ్ర - శంఖవరం : వరిసాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. నెల్లిపూడిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో పొలం పరిశీలన చేశారు తీసుకోవాల్సిన చర్యలపైరైతులకు సూచనలు ఇచ్చారు.ప్రయోగాత్మక పొలంలో పిలకల కత్తిరింపు,ఆకుల తొలగింపు పనులు చేశారు. వరిలోజిగురు పూసిన పసుపు రంగు అట్టలు పొలంలో అమర్చి శత్రు పురుగుల ఉధృతిని గమనించ వచ్చని వివరించారు. పొలం గట్లపై కంది సాగు అవశ్యకతను తెలిపారు. అనంతరం రైతులతో బృంద విన్యాసం చేయించి ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు శ్రావణి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర- గోకవరం : గోకవరం మండలం కృష్ణుని పాలెం సచివాలయం వద్ద అర్హులైన వారికి పార్టీలకతీతంగా కుల మతాలకు అతీతంగా నూతన పింఛన్లను అందజేశారు. కృష్ణుని పాలెం గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు, వైసిపి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నూతనంగా 20 మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు కృష్ణుని పాలెం సచివాలయ పరిధిలో పెన్షన్ల రూపేణా సుమారు 11 లక్షల రూపాయలు ప్రతినెల ఇస్తున్నట్టు తెలిపారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మండల మీడియా కన్వీనర్ అంబటి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా సుమారు రెండు లక్షల పెన్షన్లు ఈ నెలలో మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు, మండలం మీడియా కన్వీనర్ అంబటి ప్రసన్నకుమార్, వార్డు మెంబరు పందు దొర, బాలగొండ ప్రసాద్, రంగయ్య, అంబటి బాపరాజు, బాతు బాపిరాజు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.